సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 22 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.20,360

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.23,600, కనిష్టంగా రూ.3 వేలు, సరాసరిన రూ.14,260 ప్రకారం ధర పలికాయి.



సత్యసాయి సేవలో డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. బాబా నివసించిన యజుర్వేద మందిరాన్ని సందర్శించారు. ఆయనకు ట్రస్ట్ వర్గాలు ఘన స్వాగతం పలికాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/10.4°

జిల్లా వ్యాప్తంగా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉదయం పొంగ మంచు పెరిగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్‌: ఎండుమిర్చి ధరలు మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 131.80 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, అధికారులు ఈ నామ్‌ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ.16,500, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్‌ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు నాణ్యమైన మిర్చి తీసుకువచ్చి మంచి ధరలు పొందాలని రైతులకు ఆయన సూచించారు.

బాలయ్య.. రాలేమయ్యా

- ఎమ్మెల్యే పర్యటనలో కనిపించని ప్రజా స్పందన



మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్థానికేతరులు

చిలమత్తూరు: బాలకృష్ణ హవా తగ్గుతోందా... జనం ఆయన్ను పెద్దగా పట్టించుకోవడం లేదా.. నియోజకవర్గంలో నానాటికీ గ్రాఫ్‌ పడిపోతోందా...కార్యకర్తలు కూడా దూరమవుతున్నారా.. మంగళవారం కనిపించిన పరిస్థితి చూస్తే అలాగే అనిపిస్తోంది. గతంలో ఎప్పుడో చుట్టం చూపుగా వచ్చినా... ప్రజల్లో కాస్తో కూస్తో స్పందన ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మంగళవారం ఎమ్మెల్యే బాలకృష్ణ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనగా జనం నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. బ్రహ్మేశ్వరంపల్లి గ్రామంలో మినరల్‌ ప్లాంట్‌ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ అట్టహాసంగా వెళ్లినా స్థానికులు పత్తాలేకుండా పోయారు. బాలకృష్ణ గ్రామానికి వస్తున్నారని ముందురోజే ప్రచారం చేసినా... కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామస్తులెందుకో ఆసక్తి చూపించలేదు. అయితే మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావడంతో టీడీపీ ముఖ్య నేతలు ఊపిరి పీల్చుకున్నారు.

'మామా ఏక్‌ పెగ్‌లా' అంటూ వెండితెరపై హీరో బాలకృష్ణ కైపెక్కి ఊగగా... ఆయన నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు జనానికి అక్రమ మద్యాన్ని భారీగా పట్టిస్తున్నారు. ఆయన ఎటూ రారు..అడిగేవారు లేరు..అందుకే తమ్ముళ్లు అక్రమ మద్యాన్నే ఆదాయ వనరుగా మార్చుకున్నారు. గోవా, హర్యానా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లారీల్లో సరుకు తెచ్చి పల్లెపల్లెకీ మత్తెక్కిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. 'అక్క' అడుగుతుందేమోనన్న అనుమానంతో ఆమెకూ వాటా పంచుతున్నట్లు తెలుస్తోంది.



అక్రమ కిక్కు.. తమ్ముళ్లకు లక్కు!

మహరాజ్‌..ఈ మందేందయ్యా

- హిందూపురంలో విచ్చలవిడిగా అక్రమ మద్యం
- ఇటీవల మహారాష్ట్ర, గోవా, హర్యానా మద్యం పట్టివేత
- బాలకృష్ణ పీఏ కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు



ఈ నెల 20వ తేదీన హిందూపురంలో హర్యానా మద్యం పట్టుకున్న ఎక్సైజ్‌ పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబు బావమరిది, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తోన్న హిందూపురం నియోజకవర్గంలో అక్రమ మద్యం వ్యాపారం మూడు పూవులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని బెల్టు షాపులు, మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లారీల ద్వారా తెప్పించుకుని కొందరు టీడీపీ నేతలకు చెందిన తోటల్లో డంపు చేసి.. రాత్రి వేళల్లో లేబుళ్లు మార్చి.. తెల్లారిన తర్వాత గుట్టు చప్పుడు కాకుండా బెల్టు షాపులు, బార్లు, మద్యం దుకాణాలకు తరలిస్తున్నారు. ఫలితంగా గంటల వ్యవధిలోనే రూ.లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారు.

సరిహద్దున ఉండటంతో సులువుగా..

హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు కర్ణాటక సరిహద్దున ఉండటంతో మద్యం అక్రమ రవాణా మరింత సులువు అవుతోంది. దీనికి తోడు స్థానిక ప్రజాప్రతినిధి నియోజకవర్గానికి వస్తుండటంతో ఆయన అనుచరులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్‌ చేసి ప్రజల నుంచి కప్పం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

భారీగా పట్టుబడిన మద్యం

అక్రమ మద్యంపై పత్రికల్లో కథనాలు వెలువడటంతో రెండు వారాల క్రితం ఎక్సైజ్‌ అధికారులు ముమ్మర దాడులు చేశారు. రెండు లారీల మహారాష్ట్ర మద్యం పట్టుకున్నట్లు తెలిసింది. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుల (పీఏలు) ప్రమేయం ఉండటంతో బయటికి పొక్కకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. కానీ ఎక్సైజ్‌ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ చేపట్టి.. ఆ శాఖ సీఐపై వేటు వేశారు. అంతేకాకుండా 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పటికే మద్యం మాయం చేయడం గమనార్హం. కానీ రెండు లారీల మద్యం పట్టుకున్నట్లు మాత్రం బయటకు చెప్పలేకపోయారు.

ఆమెకూ వాటా?

హిందూపురం పట్టణంలో హోటల్, రెస్టారెంట్, బార్, వైన్‌షాప్‌.. ఇలా ఏది నిర్వహించాలన్నా స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులకు కప్పం కట్టాల్సిందే. ఇది చాలదన్నట్టు అక్రమ మద్యం వ్యాపారంలోనూ మునిగితేలుతున్నారు. మహారాష్ట్రలో 'మాన్షన్‌ హౌస్‌' మద్యం క్వార్టర్‌ రూ.80కే కొనుగోలు చేసి.. ఇక్కడ అదే సీసాను రూ.220 వరకు విక్రయిస్తున్నారు. లాభాల్లో వాటాలు పంచుకుని ఎవరికి వారు జేబులు నింపుకొంటున్నారు. ఇందులో ముఖ్య ప్రజాప్రతినిధి సతీమణికి కూడా వాటా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భారీగా హర్యానా సరుకు

ఈ నెల 20న ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బలగాలు రంగంలోకి దిగి.. హిందూపురం చుట్టుపక్కల తనిఖీలు చేపట్టాయి. ఒక వ్యాగనార్‌ కారులో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే హర్యానా మద్యం లభ్యమైంది. అందులో చాలా వరకు డిఫెన్స్‌ బాటిళ్లు ఉన్నట్లు తెలిసింది. కారును సీజ్‌ చేయడంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టు ముందు హాజరు పరిచారు. ఆంధ్ర సరుకు కంటే ఎక్కువగా గోవా, హర్యానా, మహారాష్ట్ర మద్యం హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా చెలామణి అవుతుండడం గమనార్హం.

24న ప్రాథమిక విద్య కమిషనర్‌ రాక



మాట్లాడుతున్న అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్‌: పాఠశాల విద్య కమిషనర్‌ విజయరామరాజు ఈనెల 24న జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పంచాయతీ మోడల్‌ ప్రైమరీ పాఠశాలల విధానంపై సమీక్షించనున్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ అంధ విద్యార్థుల పాఠశాలలోని ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లాలోని మండల వి ద్యాశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖ అధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప, సమగ్ర శిక్ష ఏపీసీలు శైలజ, దేవరాజు, డీసీఈబీ కార్యదర్శులు గంధం శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, డీవైఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓలు మాట్లాడుతూ కమిషనర్‌ నిర్వహించే సమీక్షకు అన్ని వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీ మోడల్‌ ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి అన్ని వివరాలు ఉండాలన్నారు. పూర్తిగా అవగాహన కల్గి ఉండాలని సూచించారు. కమిషనర్‌ ర్యాండమ్‌గా స్కూళ్ల గురించి ఆరా తీస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు, మోడల్‌ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్టీలు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా జీఎం శేఖర్‌



జీఎం శేఖర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి టౌన్‌: బీజేపీ జిల్లా అధ్యక్షునిగా జీఎం శేఖర్‌ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌ నాయుడు, జాతీయ కౌన్సిల్‌ మెంబర్‌ అంబటి సతీష్‌ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడి స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, జీఎం శేఖర్‌ విజయం సాధించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శాలువాలు, పూల బొకేలతో శేఖర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, కొండమరాజు, జ్యోతి ప్రసాద్, సురేంద్రబాబు, సునీల్‌ వైట్ల, బాలగంగాధర్, రామాంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ సాయంతో నేరాల నియంత్రణ

- ప్రతి జిల్లాకూ ఒక సైబర్‌ క్రైమ్‌ స్టేషన్‌
- డీజీపీ ద్వారక తిరుమలరావు



మాట్లాడుతున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

పుట్టపర్తి టౌన్‌: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా నేరాల నియంత్రణకు గట్టిగా కృషి చేస్తున్నట్లు డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీసు (డీజీపీ) ద్వారక తిరుమలరావు తెలిపారు. సైబర్‌ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక ఆడియోలు, వీడియోలు, విద్యాసంస్థల్లో సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి జిల్లాకూ ఒక సైబర్‌ క్రైమ్‌ పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఆయన స్థానిక ప్రశాంతినిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌ హాల్లో డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్నతో కలసి పోలీసు అధికారులతో సమీక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మారుద్దామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వంద ఎకరాల్లో మాత్రమే గంజాయి సాగులో ఉందని, దాన్ని కూడా తొలగిస్తామని చెప్పారు. మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాంగ్, ర్యాష్‌ డ్రైవింగ్‌ మానుకోవాలని, హెల్మెట్‌ తప్పక వాడాలని సూచించారు. డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ విషయంలో కఠినంగా ఉంటామన్నారు. లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపడమంటే లైసెన్స్‌ లేని తుపాకీతో విచక్షణ రహితంగా కాల్పులు జరపడంతో సమానమని అభిప్రాయపడ్డారు. ఇటీవల జిల్లా పోలీస్‌ అధికారులు విడుదల చేసిన శాంతభద్రతలు, నేర నివేదిక -2024 ప్రకారం జిల్లాలో అన్ని రకాల నేరాలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో అడిషనల్‌ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సంస్థ ఆదాయం పెంచండి

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి.. ఖర్చులు తగ్గించుకుని, సంస్థ ఆదాయం పెంచాలని డీజీపీ, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల రావు సూచించారు. ఆయన పుట్టపర్తి ఆర్టీసీ బస్సు డిపోను తనిఖీ చేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఉద్యోగులకు బకాయిలను ఈ నెలాఖరులోపు చెల్లిస్తామన్నారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: జిల్లా ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టామని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ తెలిపారు. మంగళవారం ఆయన.. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో జిల్లాలో టెంపుల్‌ టూరిజం సర్క్యూట్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, జిల్లాలో అవసరమైన చోట పర్యాటక ప్రాజెక్టుల కోసం భూమిని గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. లేపాక్షిలో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, ఓపెన్‌ ఆడిటోరియం నిర్మాణం పనులకు ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే లేపాక్షి ఆలయం జటాయువు థీమ్‌ పార్క్‌ ఫుడ్‌ కోర్ట్, స్టాళ్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించాలని సూచించారు. గొల్లపల్లి రిజర్వాయర్‌ బోటింగ్‌కు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తనకల్లు మండలంలోని కోటపల్లి గ్రామంలో పీపీపీ పద్ధతి నిర్మిస్తున్న రేస్‌ ట్రాక్, థీమ్డ్‌ లగ్జరీ రిసార్ట్‌ ప్రాజెక్ట్‌ స్థితిపై అధ్యయనం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్‌ బాబు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, పురావస్తు శాఖ ఏడి రజిత, దేవదాయ శాఖ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలు, చేయి విరిచేశారు!

- బ్యానర్‌ అడ్డంగా ఎందుకు కట్టారని ప్రశ్నించిన సామాన్యుడు
- రెచ్చిపోయి కర్రలతో దాడి చేసిన టీడీపీ నాయకులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు నరసింహ



టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన నరసింహ

చిలమత్తూరు: టీడీపీ నేతల దౌర్జన్యాలు, దుర్మార్గాలకు అంతేలేకుండా పోతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రశ్నించడమే పాపమై పోతోంది. రౌడీల్లా మారిన టీడీపీ నేతలు సామాన్యులపై భౌతికదాడులు చేస్తూ అరాచకాలకు ఒడిగడుతున్నారు. తాజాగా ఓ సామాన్యుడిపై దాడి చేసి కాలు, చేయి విరిచేశారు. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటన సందర్భంగా మంగళవారం చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి గ్రామంలో టీడీపీ నేతలు ఇష్టానుసారం బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికుడు నరసింహ ఇలా రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు ఎందుకు కట్టారని ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నేత అంజినప్ప, ఆయన కుమారుడు వేణు, గొల్ల సత్యంతో పాటు మరికొందరు దాడికి దిగారు. నరసింహపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈఘటనలో నరసింహ కుడి కాలు, ఎడమ చేయి విరగడంతో బంధువులు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గతంలోనూ దాడులు..

గతేడాది ఆగస్టులో దేమకేతేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గోపాలప్ప, ఆయన భార్య శాంతమ్మలపై కూడా టీడీపీ నాయకుడు అంజినప్ప, ఆయన కుమారుడు కొడవళ్లతో దాడి చేసి గాయ పరిచారు. అధికారం అండతో బాధితులపైనే అక్రమ కేసులు బనాయించి వేధించారు.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

- జాతీయ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు జాతు హుస్సేన్‌



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్‌ సభ్యుడు జాతు హుస్సేన్‌, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

ప్రశాంతి నిలయం: గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా జాతీయ ఎస్టీ కమిషన్‌ పనిచేస్తుందని కమిషన్‌ సభ్యుడు జాతు హుస్సేన్‌ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాలోని కదిరి, ముదిగుబ్బ మండలాల్లోని పలు తండాలను సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ అధ్యక్షతన షెడ్యూల్‌ తెగల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్‌ తెగల సమగ్రాభివృద్ధికి విద్యా కార్యక్రమాలు, జీవనోపాధి కోసం ఆర్థిక మద్దతు, పథకాల అమలు, అట్రాసిటీ, అటవీ హక్కుల చట్టం అమలు, తండాల్లో మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం జాతు హుస్సేన్‌ మాట్లాడుతూ, గిరిజనుల ప్రయోజనాలను పరిరక్షించడం, సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయడం కోసం అధికారుల కృషి చాలా అవసరమన్నారు. గిరిజనులకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలు మెరుగుపర్చాలని, తండాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి సచివాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. తండాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు కమిషన్‌కు అర్జీలిచ్చారన్నారు. తాను మూడు నెలల తర్వాత మళ్లీ జిల్లా పర్యటనకు వస్తానని, ఆ లోపు అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్పీ వి.రత్న, డీఆర్‌ఓ విజయసారథి, అడిషనల్‌ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, శర్మ, ఆనంద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఏకలవ్య పాఠశాల మంజూరుకు కృషి

కదిరి అర్బన్‌/కదిరి టౌన్‌ : యర్రదొడ్డి పంచాయతీలోని తండాల్లో ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని జాతీయ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు జాతు హుస్సేన్‌ తెలిపారు. మంగళవారం ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్‌ ఆధ్వర్యంలో కదిరి మండలం మీటేనాయక్‌ తండాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాందాస్‌నాయక్‌ తండా, బోడేనాయక్‌ తండా వాసులతో జాతు హుస్సేన్‌ సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే నేరుగా ఎస్టీ కమిషన్‌కు అర్జీ రూపంలో విన్నవిస్తే పరిష్కరిస్తామన్నారు. తండాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. గిరిజనులు విద్యావంతులు కావాలన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా బ్యాంకుల ద్వారా రుణం పొంది పరిశ్రమలు స్థాపించి నలుగురి ఉపాధి కల్పించేలా ఎదగాలన్నారు. అనంతరం తండావాసులు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్టీ కమిషన్‌ సభ్యుడికి అందజేశారు. అంతకుముందు జాతు హుస్సేన్‌ కదిరిలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. శాలువాతో సత్కరించడంతో పాటు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించి తీర్థప్రసాదాలు అందించారు.

మూడు నెలల్లో రహదారి ఏర్పాటు

- 'సాక్షి' కథనానికి స్పందించిన ఎస్టీ కమిషన్‌ సభ్యుడు

సాక్షి ఎఫెక్ట్‌..



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్‌ సభ్యుడు

ముదిగుబ్బ: మండల పరిధిలోని జొన్నలకొత్తపల్లి తండాకు మూడు నెలల్లో రహదారిని ఏర్పాటు చేస్తామని జాతీయ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు జాతు హుస్సేన్‌ తెలిపారు. మంగళవారం ఆయన జొన్నలకొత్తపల్లి తండాను సందర్శించారు. దారి సౌకర్యం లేక తండావాసులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 17న 'ఊరు ఉంది..దారి లేదు' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు...తండాకు రహదారి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆర్డీఓ మహేష్, తహసీల్దార్‌ నారాయణస్వామితో కలిసి తండావాసులతో సమావేశమయ్యారు. తండా వాసుల సమస్యలు తెలుసుకున్నారు. మూడు నెలల్లో తండాకు రహదారిని ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సమస్యలన్నీ పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

సమగ్ర గడప దాటని నిధులు

- కేజీబీవీల్లో లైబ్రరీ, ల్యాబ్, కంప్యూటర్, ఆర్ట్-క్రాఫ్ట్ తరగతి గదుల నిర్మాణాలు
- ఒక్కో గదికి రూ.20 లక్షల కేటాయింపు
- ఎస్‌ఎంసీల తీర్మానాల మేరకు నిర్మాణ పనులు
- 25 శాతం అడ్వాన్స్ ఎస్‌ఎంసీ ఖాతాలకు పంపని వైనం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనుల నిధులు ఆ కార్యాలయ గడప దాటడం లేదు. నిర్మాణాలకు సంబంధించిన నిధులు ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి జమ చేయచేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. నెలలు తరబడి పేరుకుపోయిన బిల్లులకు సంబంధించిన ఫైలు ఇప్పటి వరకూ కలెక్టర్ వద్దకు చేరలేదంటే నిర్లక్ష్యం ఎంత మేర ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆనివల్ వర్క్ ప్లాన్ (ఏడబ్ల్యూపీ) కింద జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) లైబ్రరీ, ల్యాబ్, కంప్యూటర్, ఆర్ట్-క్రాఫ్ట్ తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో గదికి రూ. 20 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలో మొత్తం 26 గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్‌ఎంసీ తీర్మానాల మేరకు పనులను కాంట్రాక్టర్లు చేపట్టారు.

గత అక్టోబరులో బడ్జెట్ రిలీజ్

తరగతి గదుల నిర్మాణాలకు సంబంధించి 25 శాతం బడ్జెట్‌ను గత ఏడాది అక్టోబర్‌లోనే అప్పటి జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లాకు దాదాపు రూ. 2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ బడ్జెట్‌ను కలెక్టర్ అనుమతులు తీసుకుని ఎస్‌ఎంసీ ఖాతాలకు బదిలీ చేయాల్సి ఉంది. 'వాల్యూ ఆఫ్ వర్క్ డన్' ఆధారంగా ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించిన తర్వాత బిల్లుల చెల్లింపునకు ఎస్‌ఎంసీ సభ్యులు అనుమతిలిస్తారు. అయితే ఇందులో ఏ ఒక్క ప్రక్రియనూ సమగ్ర శిక్ష అధికారులు పూర్తి చేయలేకపోయారు. ఇప్పటి వరకూ కలెక్టర్ కనీసం ఫైలు కూడా పెట్టలేదు. మరో వైపు పనులు చేసిన కాంట్రాక్టర్లు పార్ట్ బిల్లుల కోసం ఎస్‌ఎంసీలు, సమగ్రశిక్ష కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



కుందుర్పి కేజీబీవీలో శ్లాబ్ వేస్తున్న దృశ్యం

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

బయట జిల్లాల్లో పని చేస్తూ ఇక్కడ హెచ్‌ఓడీ ఇన్‌చార్జ్‌లుగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదంటూ సుమారు నాలుగు నెలల క్రితం జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నిబంధన సమగ్రశిక్షలో బేఖాతరవుతోంది. ఇప్పటికీ ఈఈ ఇన్‌చార్జ్‌గా శ్రీసత్యసాయి జిల్లా అధికారే వ్యవహరిస్తున్నారు. రెండు జిల్లాల్లో పని చేస్తుండడం వల్ల ఆయన ఎక్కడా అందుబాటులో ఉండడం లేదని ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు వాపోతున్నారు.

కొసమెరుపు

ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేయాల్సిన నిధుల అంశంపై ఈఈ శంకరయ్యను వివరణ కోరగా...13 రోజుల కిందటే ఏపీసీ (ప్రస్తుత డీఈఓ)కు ఫైలు పెట్టానని చెప్పారు. డీఈఓను వివరణ కోరగా...తనకు ఫిజికల్‌గా ఎలాంటి ఫైలు అందలేదని పేర్కొన్నారు.

ఈఈ 'డ్యూయల్ రోల్'తో తంటాలు

జిల్లా సమగ్రశిక్ష ఈఈగా కొనసాగుతున్న శంకరయ్య వాస్తవానికి శ్రీ సత్యసాయి జిల్లా సమగ్రశిక్ష రెగ్యులర్ ఈఈగా ఉన్నారు. రెండు జిల్లాలను సమన్వయం చేసుకోవడంలో విభాగాధిపతి విఫలమవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయన రెగ్యులర్‌గా ఉన్న శ్రీ సత్యసాయి జిల్లాలో మాత్రం ఇప్పటికే అక్కడి కలెక్టర్ ఆమోదంతో 25 శాతం నిధులను ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేశారు. అనంతపురం జిల్లాలో మాత్రం ఇప్పటి వరకూ ఆ దిశగా ఆయన ఫైలు కదపలేకపోయారు.

క్లుప్తంగా

డంప్‌యార్డ్‌లో చెత్తకు నిప్పు

- యార్డు పక్కనున్న తోటలకు వ్యాపించిన మంటలు
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు


మంటల్లో కాలిపోతున్న టెంకాయ చెట్లు

హిందూపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి పక్కనున్న తోటలకు పాకాయి. ఘటనలో రైతు నాగరాజు తోటలోని జామ, టెంకాయ చెట్లు కాలి బూడిదయ్యాయి. దీంతో పాటు రూ.3 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన డ్రిప్ పైపులు కాలిపోయాయి. కాగా, మంటలు చెలరేగిన వెంటనే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలిపినా ఆయన స్పందించలేదని ఈ సందర్భంగా బాధిత రైతు వాపోయాడు. ఘటనలో మొత్తం రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

వ్యక్తి బలవన్మరణం


మృతుడు గోవిందప్ప

పెనుకొండ రూరల్: కడుపు నొప్పి తాళలేక పెనుకొండ మండలం మావటూరుకు చెందిన టెంకాయల గోవిందప్ప (55) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య నాగమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు రోజులుగా కడుపు నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వరండాలోని పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

పుట్టపర్తి టౌన్: అందరూ బాధ్యతతో వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎస్పీ రత్న అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వాక్‌థాన్‌ను ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి, డీఎస్పీ విజయ్‌కుమార్‌తో కలసి ఆమె ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటుండడం బాధాకరమన్నారు. అత్యధికంగా హెల్మెట్ ధరించపోవడం వలన ద్విచక్ర వాహనదారుల్లో ప్రాణ నష్టం జరుగుతున్నట్లుగా గుర్తించామన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ ఉదయ్‌కుమార్ నాయుడు, సీఐలు ఇందిర, సతీష్, రవాణాశాఖ అధికారులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న, ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

- టీడీపీ నేతల దుప్పటి పంచాయితీతో సద్దుమణిగిన వివాదం

లేపాక్షి: గత శనివారం రాత్రి రోడ్డుపై ఉన్న గుంతలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటనలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన సబ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం బహిర్గతమైంది. అయితే ఈ అంశంలో టీడీపీ నేతలు జోక్యం చేసుకుని దుప్పటి పంచాయితీతో వివాదాన్ని సద్దుమణిగించారు. వివరాలు... లేపాక్షి మండలం పులమతి-కంచిసముద్రం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్యాచ్ వర్క్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పనుల కోసం రోడ్డు మధ్యలో గుంతను సబ్ కాంట్రాక్టర్ తవ్వించాడు. వెంకటాపురం క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఈ గుంత గురించి వాహనదారులను అప్రమత్తం చేసేలా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించాడు. దీంతో శనివారం రాత్రి ఆ మార్గంలో కర్ణాటకలోని జీలగుంటకు చెందిన వెంకటేష్ (45) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో సబ్ కాంట్రాక్టర్‌కు తన తప్పిదం తెలిసి వచ్చి... రాత్రికి రాత్రే పెద్ద గుంతను పూడ్చి చేతులు దులుపుకున్నాడు. అయితే సబ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే వెంకటేష్ మృతి చెందాడంటూ బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు రంగంలో దిగి మృతి ఘటనపై కాసుల బేరం చేశారు. అక్కడితో ఆగకుండా అదుపు తప్పి ద్విచక్ర వాహనం నుంచి కిందపడి మృతి చెందినట్లుగా మృతుడి కుమారుడి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో టీడీపీ నేతల శవ రాజకీయంపై స్థానికులు ఏవగించుకున్నారు. మృతుడి కుటుంబానికి బీమా సౌకర్యాలు, ప్రభుత్వ సాయం అందకుండా బాధిత కుటుంబానికి తీరని అన్యాయం చేశారంటూ మండిపడ్డారు.


ప్రమాదం అనంతరం గుంతను పూడ్చిన దృశ్యం

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

అనంతపురం: మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు మద్యం విక్రయ దుకాణాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాటి తాగు సంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్న బీసీ-ఏ కేటగిరిలోని యాట ఉపకులం, బీసీ- బీ కేటగిరిలోని గౌడ్, ఈడిగ, గాండ్ల (గమ్మల), కలాలే, గౌండ్ల, శ్రీశయన(సేగిడి) వారు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేకించి బీసీ-బీ కేటగిరిలోని ఈ ఉప కులాలకు చెందిన వారికి మొత్తం 14 మద్యం షాపులు కేటాయించారు. ఇందులో గౌడ్-2, ఈడిగ-9, గౌడ-1, కలాలే-1, గౌండ్ల-1 చొప్పున దుకాణాలు కేటాయించగా... అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి గౌడ్-1, ఈడిగ-7, గౌడ-1 చొప్పున మొత్తం 9 మద్యం దుకాణాలను కేటాయించారు. 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకూ వీరికి మద్యం విక్రయ లైసెన్స్‌లు జారీ చేస్తారు. ఒకరికి ఒక లైసెన్స్ మాత్రమే ఇస్తారు. దుకాణాల వార్షిక లైసెన్స్ ఫీజు సాధారణ దుకాణాలతో పోల్చుకుంటే 50 శాతం తక్కువగా ఉంటుంది. ఇందుకు సంబంధించి ఈ నెల 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 7న జిల్లా కలెక్టర్ల సమక్షంలో లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేస్తారు.

విటుల అరెస్ట్

కదిరి టౌన్: స్థానిక మూర్తిపల్లి రోడ్డు సమాధుల వెనుక వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు మహిళలతో పాటు, ఇద్దరు విటులను అరెస్ట్ చేసినట్లు కదిరి ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వ్యభిచారం నిర్వహిస్తున్న సోనితో పాటు ఇద్దరు విటులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు

గుంతకల్లు/అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అలాగే, రూ.1,000 జరిమానా విధించారు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్‌వలి తెలిపిన మేరకు.. గుంతకల్లు తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షేక్షావలి (50) చిల్లర దుకాణం నడిపేవాడు. 2020 జనవరి 16న ఓ దళిత బాలిక చాక్లెట్ కొనుక్కోవడానికి దుకాణం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలోనే షేక్షావలి ఆమెను లోపలికి పిలిచి తన ఒడిలో కూర్చోబెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక బిగ్గరగా అరుచుకుంటూ ఇంటికెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి టూటౌన్ సీఐ చిన్న గోవిందప్ప, డీఎస్పీ ఖాసీంసాబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేసి అనంతపురం జిల్లా కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో జడ్జి రాజ్యలక్ష్మీ మంగళవారం ముద్దాయి షేక్షావలికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే, రూ.1,000 జరిమానా విధించారు. బాలికకు ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల నష్ట పరిహారం అందించాలని ఆదేశించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, గుంతకల్లు టూ టౌన్ సీఐ ఏపీ మస్తాన్ పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు (ఏఎస్సై), హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు నాగార్జున, ఉదయ్ నాయక్ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ సిబ్బందిని అభినందించారు.

వృద్ధుడి బలవన్మరణం


విశ్వనాథరెడ్డి

తాడిపత్రి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం తక్కళ్లపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి (62) కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గతంలో శస్త్రచికిత్స కూడా చేయించుకున్నా ఫలితం దక్కలేదు. నొప్పి తీవ్రత తాళలేని ఆయన మంగళవారం తాడిపత్రి సమీపంలోని పుట్లూరు మార్గంలో ఉన్న రైల్వే గేట్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పీఎస్ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పుట్టపర్తి: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలో మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు జిల్లా ఉద్యానాధికారి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో రైతులతో కలసి క్షేత్రస్థాయిలో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కొన్ని తోటల్లో 50 నుంచి 60 శాతం వరకు పూత వచ్చిందని, మరి కొన్ని తోటలలో 10 శాతం కంటే తక్కువ పూత ఉన్నట్లుగా గుర్తించామన్నారు. పూత రాని తోటల్లో 10 గ్రాముల 13.0.45 ఎరువు, 3 గ్రాముల సూక్ష్మధాత మిశ్రమం ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఆశించిన ఫలితం ఉంటుందన్నారు. 10 నుంచి 20 శాతం పూత వచ్చిన తోటల్లో 1ఎం.ఎల్. డబుల్, 2 ఎం.ఎల్ హెక్సాకొనజోల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 50 శాతం అంతకు మించి పూత ఉన్న తోటల్లో 0.3ఎం.ఎల్.ప్లానోఫిక్స్ ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పిందె దశ ఉన్న తోటలలో నీటి తడులు ఇచ్చి యూరియా పొటాష్, జింక్, బోరాక్స్ తగు మోతాదులు అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నవీన్, రైతులు మల్లిరెడ్డి, సచివాలయ అసిస్టెంట్ సుధాకర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


సిద్ధరాంపురంలో మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానాధికారి చంద్రశేఖర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

యల్లనూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం దుగ్గుపల్లికి చెందిన ఉలవల కిరణ్ (21) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గొడ్డుమర్రికి చెందిన శివ ఇంట్లో వైరింగ్ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని పులివెందులలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

పెనుకొండ రూరల్: సామాజిక ఉద్యమకారుడు నరేంద్ర సింగ్ బేడీ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య సాగాయి. పెనుకొండ మండలం గుట్టూరు రెవెన్యూ పరిధిలో నరేంద్రసింగ్ బేడి ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసుకున్న యంగ్ ఇండియా ఫామ్ హౌస్‌లో కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కాగా, 1975–76లో గుట్టూరు కేంద్రంలో యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌ను బేడి ప్రారంభించారు. అనంతరం సేవాకార్యక్రమాలను ఉమ్మడి అనంతపురం జిల్లాకు మాత్రమే పరిమితం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 13 జిల్లాలకు విస్తరించారు. గ్రామీణులకు ఉపాధి, భూహక్కు చట్టాలపై పోరాటాలు సాగించిన సామాజిక ఉద్యమకారుడిగా ఆయన ఖ్యాతిగడించారు. కాగా, సోమవారం ఆయన మృతి తెలుసుకున్న మంత్రి సవిత, మడకశిర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుధాకర్... యంగ్ ఇండియా ఫామ్ హౌస్‌కు చేరుకుని నరేంద్రసింగ్ బేడీ మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం బేడి నివాసానికి వైఎస్సార్ సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోగాకు రామచంద్ర చేరుకుని నివాళులర్పించారు. ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆయన తల్లి అన్నే ఫెర్రర్, డైరెక్టర్ మల్లిరెడ్డి, టింబక్ట్ డైరెక్టర్ బబ్లూ, మేరీ, యంగ్ ఇండియా మాజీ ఉద్యోగులు, నల్గొండ ఆచార్య, ప్రసాద్, ప్రమీల, రామగిరి మండలం రామప్ప, గార్లదిన్నె రవి, కిష్టప్ప, బాలరాజు, వాసు, ధర్మవరం కిష్టప్ప, గుట్టూరు సూర్యనారాయణ, మంజునాథ్, కొండారెడ్డి, డ్వాక్రా రామాంజనేయులు, కోగిర జయచంద్ర, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, యంగ్ ఇండియా మాజీ ఉద్యోగులు


నరేంద్రసింగ్ బేడీ మృతదేహం

నేడు అల్ట్రా మారథాన్

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం అల్ట్రామారథాన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మంగళవారం తెలిపారు. బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ మారథాన్ మొత్తం 170 కిలోమీటర్ల మేర కొనసాగి శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ కార్యాలయం వద్ద ముగుస్తుంది. స్పెయిన్‌కు చెందిన అల్ట్రామారథానర్ జువెల్ మానువెల్ నేతృత్వంలో భారతదేశానికి చెందిన 120 మంది మొత్తం నాలుగు బృందాలుగా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 10 కిలోమీటర్లు ఏకధాటిగా ఒక టీం రన్నింగ్ చేస్తుంది. అనంతరం మరో టీం 10 కిలోమీటర్లు రన్నింగ్ చేస్తుంది. ఇలా 170 కిలోమీటర్ల అల్ట్రా మారథాన్ కొనసాగుతుంది. సంస్కృతీసంప్రదాయాల పరస్పర మార్పిడి, ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రన్నింగ్, వాకింగ్‌ను అలవాటు చేయడం ఈ మారథాన్ ముఖ్య ఉద్దేశ్యం.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక రేపు

బత్తలపల్లి: ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నం వేదికగా జరిగే 71వ రాష్ట్ర మహిళా, పురుషుల కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఈ నెల 23న బత్తలపల్లిలో ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాంతేజాగౌడ్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆచారీ, కార్యదర్శి రాగిరి రామయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బత్తలపల్లి లోని ఆర్డీటి క్రీడా మైదానం జరిగే ఈ ఎంపికలకు పురుషుల జట్టుకు 85 కిలోల బరువు, మహిళల జట్టుకు 75 కేజీల లోపు బరువున్న వారు అర్హులు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వెంట పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు తీసుకెళ్లాలి.

యువతి ఆత్మహత్య

కదిరి టౌన్: స్థానిక త్యాగరాజు వీధిలో నివాసముంటున్న కృష్ణమాచారి మూడో కుమార్తె కె.రూపవతి (24) ఆత్మహత్య చేసుకుంది. చాలా రోజులుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఆమెకు పలు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. అయినా ఫలితం దక్కలేదు. సోమవారం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిలోనూ చికిత్స చేయించుకుని వచ్చారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న రూపవతి సోమవారం రాత్రి మిద్దెపై ఉన్న ఇనుప కడ్డీకి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మదనపల్లిలో కదిరి వాసి మృతి


సాదిక్‌అలీ (ఫైల్)

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో కదిరిలోని నానాదర్గా వీధికి చెందిన సాబ్‌జాన్ కుమారుడు సాదిక్‌వలి(49) మృతి చెందాడు. మూడు రోజుల క్రితం మదనపల్లె దర్నీపేటలోని బంధువుల ఇంటికి వచ్చిన ఆయన సోమవారం రాత్రి బసినికొండ ఉరుసులో భాగంగా గంధం ఊరేగింపు చూసేందుకు బెంగళూరు బస్టాఫ్ ప్రాంతానికి వెళ్లాడు. అదే సమయంలో ఉన్నఫళంగా కుప్పకూలి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వన్ టౌన్ పోలీసుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. అనారోగ్యమే అయన మృతికి కారణంగా బంధువులు, కుటుంబసభ్యులు పేర్కొనడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చెస్‌లో రాణించిన స్టీఫెన్


ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్

అనంతపురం: నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 అండర్-13 ఓపెన్ విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో అనంతపురానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ రాణించాడు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు పోటీలు జరిగాయి. దేశ వ్యాప్తంగా 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో తలపడిన స్టీఫెన్.. మొత్తం 9 రౌండ్లకు గాను 8 పాయింట్లు (7 గెలుపు, 2 డ్రా) సాధించి చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా స్టీఫెన్‌ను ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు, అనంతపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అభినందించారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


మృతుడు శంకర్

ఉరవకొండ: తక్కువ ధరకు అందుబాటులో ఉన్న మద్యం అతిగా తాగి ఓ యువకుడు మృతి చెందాడు. ఫలితంగా ఆ కుటుంబం రోడ్డు పాలైంది. వివరాలు... ఉరవకొండలోని 5వ వార్డులో నివాసముంటున్న కురుబ శంకర్ (35)కు భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునే శంకర్... గత ఆరు నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం అతిగా మద్యం సేవించి నరసమ్మ మఠం సమీపంలో కుప్పకూలిపోయాడు. గమనించిన పరిచయస్తులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి.